క్లుప్తంగా

ఆస్పత్రి అప్‌గ్రేడేషన్‌కు జీవో జారీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నందిగామలో 100 పడకల ఏరియా ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో నంబరు 82 విడుదల చేసింది. ప్రస్తుతం నందిగామలో 50 పడకలతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) అందుబాటులో ఉంది. ఈ సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. అందుకోసం భవన నిర్మాణాలు, భూసేకరణ వంటి వాటి కోసం రూ.34.48 కోట్లు కేటాయించింది. అప్‌గ్రెడేషన్‌లో భాగంగా వివిధ కేడర్‌లలో 52 కొత్త పోస్టులను క్రియేట్ చేయడంతోపాటు, జీ+4 అంతస్తుల్లో 60 వేల చదరపు అడుగులతో కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు ఆ జీవో పేర్కొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



జగ్గయ్యపేటఅర్బన్:జగ్గయ్యపేట పట్టణంలో ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం అకస్మిక దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కేవీ సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది డీపీ తండా, శాంతినగర్‌ల్లో దాడులు చేశారు. బాణావత్ సావిత్రి అనే మహిళ వద్ద నుంచి 54 సీసాలు, పగిడిపరితి వెంకన్ వద్దనుంచి 15 సీసాలు కలిపి మొత్తం 69 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎం.రామశేషయ్య తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎం.రామశేషయ్య, హెడ్ కానిస్టేబుల్ కె.మధు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు గుర్తింపుకార్డుతో బహుళ ప్రయోజనాలు

నందిగామరూరల్: రైతు గుర్తింపు కార్డుతో బహుళ ప్రయోజనాలున్నాయని సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో కొనసాగుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రైతు విశిష్ట సంఖ్య నమోదును ఏపీఎఫ్ఆర్ పోర్టల్ ద్వారా రైతులంతా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నంబరు ఉన్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు అందుతాయని చెప్పారు. ప్రతి రైతు విధిగా విశిష్ట సంఖ్యను పొందాలని సూచించారు. ఆయన వెంట ఏవో ఖాశీం ఉన్నారు.

నేతన్నల జీవితాలతో చెలగాటం తగదు

చేనేత నాయకుడు పెంటి శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం పాలనలో ఆప్కో అవినీతిమయంగా మారి నేతన్నల జీవితాలతో చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేత, జౌళీ శాఖలో పలువురు కమీషన్ల కోసం కక్కుర్తి పడి చేనేతలకు అన్యాయం చేసిన కుట్రలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఇటీవల ఆప్కో 2.99లక్షల వస్త్రాల ఆర్డర్‌కు అనుమతులు తీసుకొని, అందులో సుమారు 23,481 కార్పెట్లను తెలంగాణా నుంచి సేకరించినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ముఖ్యంగా రూ.210 ఖరీదు చేసే వాటిని రూ.310కు కొనుగోలు చేశారంటే లక్షల రూపాయలు చేతులు మారినట్లేనన్నారు. కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ నేతలు, ఆప్కో అధికారుల కుట్రతో నేతన్నలకు తీవ్రంగా అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అనేక చేనేత సంఘాల్లో ఉన్న వస్త్రాలను ఆప్కో సంస్థ ద్వారా విక్రయించి చేనేతలకు, సంఘాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు న్యాయం చేసేందుకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.

అధ్వానంగా దాములూరు కూడలి రోడ్లు

- కంపచెట్లతో మూసుకుపోయిన రోడ్లు..
- ప్రమాదకరస్థితిలో కట్టలేరుపై ప్రయాణం
- ఆందోళనలో భక్తులు, ప్రజలు
- మరమ్మతులు చేపట్టాలని డిమాండ్



ప్రమాదకరంగా దర్శనమిస్తున్న వైరా-కట్టలేరుపై ఉన్న కల్వర్టు



రాళ్లుపైకి లేచి అధ్వానంగా దర్శనమిస్తున్న తొర్రగుడిపాడు రోడ్డు



సోమవరం గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరుపక్కలా దట్టంగా పెరిగిన కంపచెట్లు

నందిగామరూరల్: నందిగామ నుంచి దాములూరు కూడలిలోని సంగమేశ్వరస్వామి వారి ఆలయానికి నందిగామ, వీరులపాడు మండలాల నుంచి వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు, వాహనచోదకులు అవస్థలుపడుతున్నారు. పల్లగిరి, తొర్రగుడిపాడు గ్రామాల మీదుగా వెళ్లే రహదారులు అత్యంత ప్రమాదకరంగా మారగా, తొర్రగుడిపాడు రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాళ్లు పైకి లేచి ప్రమాదాలకు నెలవుగా మారింది. పల్లగిరి రోడ్డుకు చేపట్టిన మరమ్మతులను సైతం మమ అనిపించారు. తొర్రగుడిపాడు నుంచి దాములూరు వెళ్లే రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

భక్తులకు తప్పేలాలేని ఇక్కట్లు..

దాములూరు కూడలిలో వేంచేసియున్న పర్వతవర్థిని సంగమేశ్వరస్వామి ఆలయం దక్షిణ కాశీగా ప్రాశస్త్యం పొందడంతో శివరాత్రి తిరునాళ్లకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఏటా వేలాది మంది భక్తులు వస్తుంటారు. వైరా కట్టలేరులో ప్రజలు పిండప్రదానాలు చేస్తుంటారు. శివరాత్రి మహోత్సవాల సందర్భంగా నాలుగురోజుల పాటు నిర్వహించి తిరునాళ్ల మరో 12రోజులు మాత్రమే ఉంది. ఈ క్రమంలో ఈ ఆలయానికి వచ్చే రోడ్లన్నీ అధ్వానంగా ఉండటంతో భక్తులు, ప్రజలకు ఇక్కట్లు తప్పేలా లేవు.

శిథిలావస్థకు చేరిన కల్వర్టు..

వీరులపాడు మండలం పల్లంపల్లి నుంచి వచ్చే రోడ్డులో వైరా కట్టలేరుపై ఉన్న కల్వర్టు పూర్తి శిథిలావస్థకు చేరింది. దీంతో కల్వర్టు మీదుగా రాకపోకలు సాగించే సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సంభవించిన అకాల వర్షాలు, వరదాలకు కల్వర్టు పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. వైరా కట్టలేరుపై బ్రిడ్జి నిర్మించినప్పటికీ ఇప్పటివరకు అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ప్రజలు ఈ కల్వర్టుపై నుంచే ప్రమాదకరరీతిలో రాకపోకలు సాగిస్తున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కృషి చేసినప్పటికీ ఎన్నికలు సమీపించడంతో పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల తర్వాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలలుగా ఈ పనులు ప్రారంభించడంలో మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు..

నందిగామ నుంచి దాములూరు కూడలి గ్రామానికి వెళ్లే నాలుగు రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు దట్టంగా పెరిగి రోడ్డును మూసివేశాయి. బస్సు, లారీ వంటి పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పుకునేందుకు కూడా వీల్లేనంతగా కంప చెట్లు పెరిగాయి. కంపచెట్లు కళ్లకు తగిలి ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని ఆటోల్లో ప్రయాణించేవారు, ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంప చెట్లు తొలగించాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు కంపచెట్లను కూడా తొలగించాలని భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి..



నందిగామ నుంచి దాములూరు కూడలి వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. రాత్రి సమయంలో ప్రయాణం మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. మహాశివరాత్రి తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు. అధికారులు స్పందించి ఆయారోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– నాదెండ్ల నరేంద్ర, నందిగామ

కంప చెట్లు తొలగించాలి..



దాములూరు కూడలి వెళ్లే రహదారులకు ఇరుపక్కలా కంప చెట్లు దట్టంగా పెరిగిపోయాయి. పెద్ద వాహనం వస్తే తప్పుకునేందుకు కూడా వీలే లేనంతగా కంప చెట్లు ఉండటంతో ఆటోలు, ద్విచక్రవాహనాలపై వచ్చే వారికి ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించాలి.

– వేల్పుల రాము, పల్లగిరి

వెంకటేశ్వరుడికి గరుడ సేవ



పల్లగిరి(నందిగామరూరల్):మండలంలోని సత్యవరం పల్లగిరిగట్టుపై వేంచేసియున్న అలివేలు మంగా పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారికి బుధవారం గరుడసేవను ఘనంగా నిర్వహించారు. మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకుడు పరాశరం పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైఖానస సంప్రదాయ పద్ధతిలో స్వామివారి మూలవరులకు సుగంధద్రవ్యాలతో తిరువంజనం, అష్టోత్తర సహస్రనామ పుష్పార్చనలను వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తొర్లికొండ సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

నందిగామటౌన్(నందిగామరూరల్): ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని చందాపురం నుంచి డీవీఆర్ కాలనీకి వెళ్లే సర్వీస్ రోడ్డులో బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈఘటనలో హనుమంతపాలెంనకు చెందిన గాడిపర్తి రాధాకృష్ణ, పవన్‌సాయి, మరో వాహనంపై ఉన్న అనాసాగరంనకు చెందిన మాదాసు శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని విజయవాడ తరలించారు.

డూలాస్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

నందిగామరూరల్: సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ డూలాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని మునగచర్లలో ట్రస్ట్ సౌజన్యంతో బుధవారం ఆరువేల మందికి దుస్తులు, 25మందికి ట్రైసైకిళ్లను కూటమి నేతలతో కలిసి బుధవారం రాత్రి ఆమె పంపిణీ చేశారు. ముందుగా నూతన వధూవరులు మణిఆనంద్, యుఎస్‌కు చెందిన యాంబర్‌ను ఆమె ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డూలాస్ ట్రస్ట్ ఎంతో విలువైన సేవలను అందిస్తుందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం డూలాస్ ట్రస్ట్ చైర్మన్ పగిడిపల్లి దేవసహాయంను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'చేతన' ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ

నందిగామటౌన్(నందిగామరూరల్): చేతన ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొనియాడారు. పట్టణంలోని కమ్మ కళ్యాణ మండపంలో ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం పలువురు పేదలకు తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, గ్రైండర్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు అండగా ఉండటమే కాకుండా కుట్టుమిషన్ల పంపిణీతో మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం హర్షణీయం అంటూ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగండ్ల రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు పాలేటి సతీష్, న్యాయవాది బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి



వేపులవాగును పరిశీలిస్తున్న కౌన్సిలర్ వట్టెం మనోహర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని వేపలవాగు ప్రవహిస్తున్న పరిసరప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోతుండటంతో ఆయా ప్రాంతాలన్నీ చెత్తతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని 5వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ అన్నారు. ఆయన బుధవారం వేపలవాగును పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వేపలవాగు ప్రవహించే 2, 5, 6, 7, 9వవార్డుల్లో దోమల సమస్య కూడా అధికంగా ఉందన్నారు. ఈప్రాంతాల్లో సరైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోతుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. గతేడాది సంభవించిన వరదల కారణంగా ఆయా వార్డుల్లో ఆస్తినష్టం జరిగిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం అందించలేదన్నారు. పారిశుద్ధ్య సమస్యపై పలుమార్లు మున్సిపల్ చైర్మన్, కమిషనర్లకు ఫిర్యాదు చేసినప్పటికీ లాభం లేకపోయిందన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్పందించి వేపలవాగు ప్రవహించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితి మెరుగుపడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వేపలవాగు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావుకు, డీఈఈ కలీముల్లాలకు వినతి పత్రాలు అందజేశారు.

ప్రతిభ చూపిన గురుకుల విద్యార్థులు



జగ్గయ్యపేటఅర్బన్: స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్(2024–25)లో జగ్గయ్యపేటకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో దేశవ్యాప్తంగా 1576 టీం ఐడియాస్ ఎంపికయ్యాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 76టీంలు ఎంపిక కాగా అందులో జిల్లాలోని జగ్గయ్యపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల నుంచి 6 ప్రాజెక్టులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏటీఎల్ ఇన్‌చార్జ్ కారిచర్ల శ్రీదేవి, ఏటీఎల్ మెంబర్ కె.రాజీవ్, విద్యార్థులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

జేఈఈలో ప్రతిభచూపిన పల్లంపల్లి విద్యార్థి



కంచికచర్ల: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.09శాతం మార్కులు సాధించిన శ్రీఅక్షర జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థి గుదె సాత్విక్‌భానును కళాశాల యాజమాన్యం బుధవారం అభినందించింది. వీరులపాడు మండలం పల్లంపల్లి గ్రామానికి చెందిన సాత్విక్ భాను అత్యుత్తమ మార్కులు సాధించడం ఆనందంగా ఉందని కళాశాల కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు తెలిపారు. సాత్విక్‌ను అభినందించిన వారిలో కళాశాల చైర్మన్ గడుపూడి శ్రీరామ్, అధ్యాపకులు ఉన్నారు.

కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మిక పర్యటన



పోచంపల్లిలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

జగ్గయ్యపేట: గ్రామాల్లో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. మండలంలోని పోచంపల్లి, అనుమంచిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా పోచంపల్లి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ)ని పరిశీలించి సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియపై పంచాయతీ అధికారులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ 65వ నబరు జాతీయ రహదారి నుంచి పోచంపల్లికి డీఎంఎఫ్ నిధులతో నిర్మించిన బీటీ రోడ్డుకు సంబంధించిన కొలతలు, రికార్డులను పరిశీలించారు. అనుమంచిపల్లిలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని పరిశీలించారు.

అర్జీలను పరిష్కరించకుంటే సహించను..

అనంతరం ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో మండలంలో వచ్చిన అర్జీలు పరిష్కరించిన సమస్యలను ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన సమస్యలను కూడా నెలాఖరు నాటికి పరిష్కరించాలన్నారు. లేకుంటే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోఖ్వాల్, పంచాయతీ రాజ్ ఎస్ఈ రమేష్, ఎంపీడీవో నితిన్, వ్యవసాయశాఖ ఏడీఏ భవానీ, పంచాయతీ రాజ్ జేఈ శ్రీనివాస్, మండలస్థాయి అధికారులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు సమర్పణ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

పెనుగంచిప్రోలు :శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల రెండోరోజైన బుధవారం పెద్దసంఖ్యలో భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. దీక్ష విరమించిన స్వాములు తెల్లవారుజాము నుంచే మునేరులో స్నానమాచరించి అమ్మవారికి దర్శనానికి బారులు తీరారు. క్యూలైన్లు మొత్తం భక్తులతో నిండిపోయాయి. భక్తులతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. మంగళవారం రాత్రి కల్యాణం అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో గ్రామంలోని ఆలయాలు, ఇసుక తిన్నెలపై సేద తీరారు.

సేంద్రియ ఎరువులతో అధిక ఫలసాయం



కంచికచర్ల: సేంద్రియ ఎరువుల వినియోగంతో రైతులు అధిక ఫలసాయం పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి కె.విజయకుమార్ సూచించారు. మండలంలోని కొత్తపేట, చెవిటికల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కొత్తపేట ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు వ్యవసాయం, అనంతరం క్షేత్ర దర్శనంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి నీలిమ, గ్రామీణ వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నందిగామ రూరల్: మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించినట్లు ఏపీవో శరత్‌బాబు తెలిపారు. మండలంలోని కొణతమాత్మకూరులో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ 2024–25కు సంబంధించి 887 కుటుంబాలకు 100 రోజుల పని కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 1322 మంది పని చేస్తున్నారని వివరించారు.

150 మందికి వైద్యపరీక్షలు

మాగల్లు(నందిగామ రూరల్): క్యాన్సర్‌పై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సూర్య సూచించారు. గ్లోబల్ గ్రేస్ హెల్త్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో మండలంలోని మాగల్లులోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో బుధవారం క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. 135మందికి క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ స్క్రినింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



జలబిందెలు తీసుకువస్తున్న వారితో ఆలయ ఈఓ కిషోర్‌కుమార్, ఈఈ రమ, సిబ్బంది తదితరులు



పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో భక్తుల కోలాహలం



పోలీస్‌స్టేషన్ వద్ద జలబిందెలకు స్వాగతం పలికి బిందెలను ఎత్తుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అర్జున్

జలబిందెల కార్యక్రమానికి పోటెత్తిన భక్తులు



జలబిందెలకు వార్లు పోసేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు, భక్తులు

శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లలో భాగంగా బుధవారం జలబిందెల కార్యక్రమం వైభవంగా సాగింది. జలబిందెలకు గ్రామంలో మహిళలు నీటితో వార్లు పోసి ఘనస్వాగతం పలికారు. పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్, సిబ్బంది స్వాగతం పలికి జలబిందెలను నెత్తిన పెట్టుకున్నారు. మంగళ వాయిద్యాలు, కొమ్ము ధ్వనులు, డప్పు మోతలు, కోలాట నృత్యాలతో గ్రామం మార్మోగింది.

– పెనుగంచిప్రోలు



కోలాట నృత్యాన్ని తిలకిస్తున్న భక్తులు